# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

❖ అమరావతిపై విమర్శలకు అభివృద్ధే సమాధానం ఇస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

❖ రానున్న మూడేళ్లలో అమరావతి మొదటి దశ నిర్మాణాలు పూర్తి చేస్తామని మంత్రి పి.నారాయణ ప్రకటించారు.

❖ రాష్ట్రంలో చట్టాలు, న్యాయవ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు.

❖ సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవం ఏర్పాట్లు పూర్తి చేశామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.

=====================

అమరావతిపై విమర్శలకు అభివృద్ధే సరైన సమాధానం ఇస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో చంద్రబాబు నాయుడు ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... సైబరాబాద్ వల్ల హైదరాబాద్ అభివృద్ధి చెందుతూనే ఉందని, అమరావతి కూడా ఇదే తరహాలో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో జరుగుతున్న శిక్షణా తరగతులలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు చేరువ చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. రాష్ట్రలో క్లీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నామని, క్లీన్ పాలిటిక్స్ కూడా చేస్తున్నామని తెలిపారు. కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్ కార్యక్రమం చేపడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

=====================

వచ్చే మూడేళ్లలో అమరావతి మొదటి దశ నిర్మాణాలు పూర్తి చేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ ప్రకటించారు. విజయవాడలో పాత్రికేయుల సమావేశంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ... శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, అధికారుల భవనాలు మే నెలాఖరుకు సిద్ధం చేస్తామని తెలిపారు. మే నెల చివరి నాటికి 90

శాతం ప్రభుత్వ భవనాలు సిద్ధమవుతాయన్నారు. ట్రంక్ రోడ్లు, లేఅవుట్ పనులు 2027 నాటికి పూర్తవుతాయని, ఐకానిక్ టవర్లు సహా ప్రధాన నిర్మాణాలు 2028 ఆగస్టు నాటికి సిద్ధం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రణాళికలకు అనుగుణంగానే అమరావతిలో పనులు జరుగుతున్నాయని వివరించారు. రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు సాఫీగా సాగుతోందని నారాయణ తెలిపారు.

====================

సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవం ఏర్పాట్లు పూర్తి చేశామని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. చందనోత్సవం ఏర్పాట్లపై మంత్రులు అనిత, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామితో కలిసి ఆయన ఈరోజు విశాఖపట్నంలో సమీక్ష నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ... స్వామి వారి నిజరూప దర్శనానికి ఎక్కువ మంది భక్తులకు అవకాశం కల్పించే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ఆన్‌లైన్ లో 80 శాతం టికెట్ లు అందుబాటులో ఉంచుతామన్నారు. భక్తులు స్లాట్‌ల ప్రకారమే దర్శనాలకు రావాలని సూచించారు. అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులకు తొలుత నిజరూప దర్శనం కల్పిస్తామన్నారు. సింహాచలం క్షేత్రంలో ఈ నెల 20న జరగనున్న చందనోత్సవంకు దాదాపు లక్షా 50 వేల మంది భక్తులు వచ్చే అవకాశముందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

అనంతరం చందనోత్సవం ఏర్పాట్లపై హోం మంత్రి అనిత మాట్లాడుతూ... గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సామాన్య భక్తుల దర్శనాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

====================

సామాజిక సమానత్వం కోసం పోరాడిన మహా సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ముఖ్యమంత్రి ఈరోజు నివాళులర్పించారు. అస్పృశ్యత, కుల వివక్ష, బాల్య వివాహాలు వంటి సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా ఆయన ధైర్యంగా పోరాడి.. అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేశారని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన ఆశయాలను ఎన్డీయే కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకువెళ్తోందని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి కేంద్రమంత్రి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జ్యోతిరావు పూలే కేవలం ఒక ప్రాంతానికి చెందిన వ్యక్తి కాదని.. ఆయన ఆశయాలు రెండు శతాబ్దాలుగా ప్రపంచానికి ఆధారంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

విరామం

====================

ఆంధ్రప్రదేశ్‌లో చట్టాలు, న్యాయవ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. విశాఖపట్నంలో మానవ అక్రమ రవాణా, బానిస కార్మిక వ్యవస్థ (రద్దు) చట్టం-1976 పై ఈరోజు కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి మాట్లాడుతూ.. పోలీసు శాఖ, న్యాయవ్యవస్థ పరస్పర సమన్వయంతో పనిచేస్తే.. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందుతుందన్నారు. పోక్సో కేసుల్లో బెయిల్ రాకుండానే శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. ఆపరేషన్ ట్రేస్‌లో భాగంగా 900 మంది పిల్లలను, వివిధ దేశాల్లో చిక్కుకున్న 180 మందిని రక్షించామని తెలిపారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ సమర్థ చర్యలకు నిదర్శనమని పేర్కొన్నారు. పిల్లల రక్షణ, మానవ అక్రమ రవాణా నిరోధం, బలవంతపు కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

====================

రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు సూచించారు. పశ్చిమ గోదావరి జిల్లా యనమదుర్రు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ... రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు కృషి చేయాలన్నారు.

====================

ఉద్యోగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ గ్రీవెన్స్‌లో ఉద్యోగులు తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయవచ్చన్నారు. ప్రతి నెలా మూడవ శుక్రవారం ఉద్యోగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని, వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

====================

శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం చందనోత్సవ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ప్రక్రియకు సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్ ను మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి ఈరోజు ప్రారంభించారు. విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో తొలి టిక్కెట్‌ను దేవదాయ శాఖ మంత్రి కొనుగోలు చేశారు. సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో టిక్కెట్లను విక్రయించనున్నట్లు దేవస్థానం ఈవో వెంకటరావు తెలిపారు.

====================

అంతర ఒడిశా నుండి మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి, అంతర తమిళనాడు ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణంలో దక్షిణ, నైరుతి గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు పేర్కొన్నారు. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్ లో రేపు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

====================

జ్యోతిరావు పూలే ఆశయ సాధనలో భాగంగా ప్రభుత్వం అట్టడుగు వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో మహాత్మ జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది వేడుకలు ఈరోజు నిర్వహించారు.

====================
====================